
# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్ధమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# పిక్చర్ అభీ బాకీ హై మేరే దోస్త్!!

"ఎప్పటికీ దూరం కాలేని బాల్యపు జ్ఞాపకాలు నిక్షిప్తం చేసుకున్న ఖనిజాలురా కజిన్స్ అంటే!!

ఏం శిశిర్.. ఇదే కదూ, మీ నాన్న మాట!" శివ అంకుల్ గొంతులో ఎంత దాచుకుందామనుకున్నా దాగని ఆత్రుత, మార్దవంగా వినిపిస్తున్న ఆ గొంతులో దాగని జీర...

" అవునంకుల్, అంతే కాదు కావాలంటే కాకులే రావడం లేదు, మనుషులెలా వస్తారు? అని కూడా అంటారు " అన్నాను నెమ్మదిగా, నవ్వుతూ..

"అవునవును! వాడన్నది ఎంతో నిజం." అన్నాడాయన."

"ఏమయిందంకుల్? ఈజ్ ఎవిరీథింగ్ ఓకే?" అన్నాను గొంతులో వ్యంగ్యాన్ని కనబడనీయకుండా.

" అంకుల్ ఏమిట్రా? ఎవరో పైవాళ్ళని పిలిచినట్టు. బాబాయ్ అను.. అవును బాబాయ్ నే.. మీ నాన్నకన్నా సరిగ్గా మూడు నెల్లు చిన్నవాడిని..ఈ సారి గట్టిగా నవ్వాడాయన..

ఎంతో అందమైన బేరీటోన్ గొంతు ఆయనది. పాటలు చాలా బాగా పాడేవాడు, 'ఇప్పుడు పాడుతున్నాడో లేదో?' అనుకున్నాను , ఆయన నవ్వు వింటూ..

" ఏరా? మాట్లాడవేం?"

నిన్నటికీ ఈ రోజుకి ఎంత తేడా?

" హేయ్.. శిశిర్.. యా, శివ హియర్! దట్స్ రైట్. మీ డాడ్ కాల్ చేసాడుట.. జస్ట్ వాంటెడ్ టు చెక్ , ఏదైనా అర్జంటా? " అని.. యూ నో హవ్ హీ ఈజ్. అందుకే నీకు" ఇలా ఉండేవి ఆయన కాల్స్ మొన్నటివరకు.

'పొద్దున్నే మీ నాన్న చేసినప్పుడు నేను లేను, కాని ఆయనకి చేస్తే ఇప్పుడప్పుడే మాట్లాడడం ఆపడు, నా టైం వేస్ట్! అందుకే ఏదైనా ముఖ్యమైన పని ఉంటే చెప్తావని నీకు చేశాను! అని అర్థం బాగా కొట్టవచ్చేట్టుగా, మొహమాటం లేకుండానే చెప్పేవాడు. అలాంటిది ఇప్పుడిలా??

"నాకు తెలుసు నువ్వేం ఆలోచిస్తున్నావో! ఇతనికింత హఠాత్తుగా ఏమయిందనేగా? ఏదైనా ఒక విషయం తెలియడానికి సినిమాల్లో చూపించినట్టుగా వేలల్లో ఒకరికి తప్ప రాని జబ్బు రావడం గానీ, లేదా హఠాత్తుగా ఆస్థులన్నీ పోయి రోడ్డునపడే పరిస్థితి వచ్చేసాకా కానీ, ఎవరెలాంటివాళ్ళో తెలియడం లాంటివి కానీ జరగక్కర్లేదురా.!"

ఏదో ఒక సంఘటన, అది జ్ఞాపకం కావచ్చు, మరేదైనా కావచ్చు.

ఆ సరేలే, నీకు ఆలస్యం అవుతుంది.. మరో గంటాగి ఫోన్ చేస్తాలే, అప్పటికి వాడి పూజ అయిపోతుందిగా! " అంటూ హడావిడిగా ఫోన్ పెట్టేశాడు.

ఫోన్ ఆపేసి స్నానానికి వెళ్ళిపోయాను. నాన్నతో చెబ్దామంటే ఆరుబయట మఠం వేసుకుని ధ్యానంలో కూర్చుని ఉన్నారు. దాన్నే పూజ అంటారాయన. మళ్ళీ ఫోన్ చేస్తానన్నాడుగా అంకుల్. అదే బాబాయ్..అప్పుడాయనకే తెలుస్తుందిగా! అనుకుంటూ తయారవసాగాను.

'శివ అంకుల్ ఫోన్ చేశారని, మళ్ళీ చేస్తారని నాన్నతో చెప్పమని కావేరితో చెప్పి బయలుదేరాను. బయలుదేరుతుంటే హరి అంకుల్ ఫోన్.. 'మెల్బోర్న్ లో రీ బోర్న్' అయ్యాను, ఇక్కడే ఉంటే ఎలా ఉండేవాడినో? అని చెప్పుకుంటూ తిరిగే అతను అప్పుడప్పుడు వస్తాడు ఇండియాకి, అరుదుగా మా ఇంటికి. ఐదు నిమిషాలుంటే గగనం, ఇంచుమించు శివ అంకుల్ లాగే మాట్లాడి పెట్టేశాడు.

'ఇదంతా ఏమిటబ్బా? 'అనుకున్నాను, కానీ వెంటనే నాకేమీ తట్టలేదు.

పెట్టిన టిఫిన్ తింటూ ఆలోచించాను.. కార్ తీస్తూ ఆలోచించాను. ఆఫీస్ కి వెళ్తూ ఆలోచించాను..వెళ్ళాకా ఇంక ఆలోచించడానికి టైం లేక వదిలేశాను..

నాన్నా, శివ అంకుల్, హరి అంకుల్ వీళ్ళంతా అన్నదమ్ముల పిల్లలు. నలుగురు అన్నదమ్ములు తాతగారు వాళ్ళు.ఇద్దరు అక్కచెల్లెళ్ళు. అందరి పిల్లలు కలిసే పెరిగారు ఇంచుమించుగా. ఒకేఊరిలో ఉండకపోయినా అందరూ దగ్గరలోనే ఉండడంతో తరచూ కలిసే వారు. మొత్తం పన్నెండుమందిట. ఐదుగురు ఆడపిల్లలు, ఏడుగురు మగపిల్లలు. వారిలో చాలామంది అరవైలకి దగ్గరపడుతున్నారు, ఇద్దరు ముగ్గురు మాత్రం యాభైల్లో ఉన్నారు.

ఉద్యోగాలకోసమనో, పిల్లల చదువులకోసమనో దేశంలోని ఇతర ప్రాంతాలకీ, విదేశాలకీ వెళ్ళిన వాళ్ళిప్పుడిప్పుడే వెనక్కి వస్తున్నారు. అమెరికాలో ఉన్న ముగ్గురు ఇంకా ఏదీ తేల్చుకోలేకపోతున్నారు.

నాన్నది మొదటినించీ విలక్షణ స్వభావమే. ఎప్పుడో తాతగారు వచ్చి స్థిరపడిన హైదరాబాద్ ని వదిలే ప్రసక్తే లేదన్నారు. యూనివర్సిటీలో లెక్చరర్ గా చేరి, ప్రొఫెసర్ గా ఎదిగి మరో రెండు నెలల్లో రిటైర్ అవబోతున్నారు.

అమ్మ స్కూల్ లో పనిచేసేది, ఈ మధ్య ఆరోగ్యం అంతగా సహకరించక మానేసింది. నేనూ, కొద్దినిమిషాలు వెనక పుట్టినందుకు తమ్ముడయినవాడు వసంత్.. వాడు యూ.కేలో, నేనిక్కడ.కావేరి నా జీవనది, మంజీర వాడి సహచరి.ఇద్దరికీ ఒకేసారి పెళ్ళిళ్ళయ్యాయి. కావేరి నృత్యకళాకారిణి, తనకదే వృత్తి, ప్రవృత్తి.

అపార్ట్ మెంట్ సంస్కృతికి అలవాటు పడలేని నాన్న యూనివర్సిటీ క్వార్టర్స్ నించి సరాసరి తను దగ్గరుండి కట్టించిన స్వంత ఇంట్లోకే మారడం. ముందు, వెనకా చాలినంత స్థలం, పెంచాలే కానీ పోటీ పడి పెరిగే మొక్కలూ, సిటీ మధ్యలో ఉంటూ కూడా ఏది ఎంతవరకూ అవసరమో, అంతవరకే వాడుకుంటూ తృప్తిగా బ్రతికే అమ్మా, నాన్న.

కోడలొచ్చాకా నాట్య శిక్షణకి, సాధనకీ బావుంటుందని వెనక చిన్న కుటీరం లాంటిది వేయించారు నాన్న. అదో అతి చిన్న నృత్యగ్రాం కావేరికీ, ఆమె శిష్యులకీ.

మానవసంబంధాలని బలంగా నమ్ముతారు నాన్న. కుటుంబమంతా కలిసి ఉండాలని ఆయన తపన. తమ్ముడు యూ. కే వెళతానంటే ఆయన మొదట ఒప్పుకోలేదు. మనకున్నది చాలదా? ఎందుకా పరుగులు? అన్నారు. అమ్మా, నేనూ చెప్పి ఒప్పించాం. మూడేళ్ళేకదా, త్వరలోనే వచ్చేస్తాడు అని. మంజీరకి, అమ్మకిమొదలయిన చిన్న, చిన్న తగవులు ఆ రకంగా దూరమవుతాయని ఆశపడ్డాను నేను. అది కొంతవరకూ నిజమే అయింది.

పని దగ్గరా, భోజనం దగ్గరా ఖచ్చితంగా ఉండే నాన్న మనుషులని చూస్తే మాత్రం ఆగలేరు.ఎప్పుడూ తన చుట్టూ నలుగురుండాలనుకుంటారు. తమ కుటుంబంలో అందరివీ పుట్టినరోజులూ, పెళ్ళిరోజులు అన్నీ గుర్తు పెట్టుకుని, ఫోన్లు చేస్తారు. అవతలవారి స్పందన ని ఆశించేవారేమో తెలీదు, వచ్చిందా, లేదా అని మాత్రం పెద్దగా పట్టించుకున్నట్టు కనబడేవారు కాదు.

అక్కడే అమ్మ గొడవచేసేది. "మీరిన్ని సార్లు చేస్తారు వాళ్ళల్లో ఎవరైనా మనల్ని ? మావందరివీ వదిలేయండి, కనీసం మీ పుట్టినరోజు కైనా ఒక్కరైనా ఫోన్ చేస్తారా? " అనేది. ఆయన వినీ విననట్టు ఊరుకునేవారు. మా లక్ష్మణ్ అప్పుడు చెయ్యలేదూ? అంటూ గుర్తుచేసేవారు.

"నీకు తెలియనిదేముంది పూర్ణా, ఎవరి ఉద్యోగాలూ, సంసారాలూ, తాపత్రయాలు వారివి. వాటిల్లో పడితే కాలమే గుర్తుండదు.. ఇంక కజిన్సేం గుర్తుంటారు?" అనేవారు.

"మరి మీకు మాత్రమే ఎందుకు గుర్తుండాలి?" అనేది అమ్మ. ఇలా నడుస్తూనే ఉండేవి వాళ్ళిద్దరి మధ్య సంభాషణలు.

వివిధ ప్రదేశాలనించి తిరిగివచ్చిన తన కజిన్స్ ఇళ్ళకి అప్పుడప్పుడు వెళ్ళి పలకరించి వస్తూ ఉంటారాయన. వాళ్ళు అప్పుడప్పుడు వచ్చినా, అమ్మ మాటల్లో చెప్పాలంటే "వాళ్ళకి మనం లెఖ్ఖే లేదు, మీరు ఊరికే పట్టుకు వేళ్ళాడతారు కాని."

అలాంటిది ఈరోజు ఒకరు కాదు, ఇద్దరు ఒకరి వెంట ఒకరు ఫోన్ చెయ్యడం ఏమిటి? అన్న విషయమే ఆశ్చర్యంగా ఉంది. మరో రెండురోజుల్లో ఇంకో ముగ్గురు ఫోన్ చెయ్యడం, ఊర్లో ఉన్న శివ బాబయ్, రాఘవ పెద్దనన్న మా ఇంటికి రావడం దాన్ని రెట్టింపు చేసింది.

వచ్చేవారం శివ బాబాయ్ మా అందరినీ వాళ్ళింటికి భోజనానికి పిలిచి మరీ మరీ రమ్మని చెప్పి వెళ్ళాడు..

నాకెవరి మీదా ప్రత్యేకమైన ఇష్టం కానీ, అయిష్టం కానీ లేకపోయినా ఆయన నాలుగేళ్ళ క్రితం అమెరికానించి తిరిగి వచ్చి బ్రహ్మాండమైన ఇంద్రభవనంలాంటి ఇల్లు కట్టి, గృహప్రవేశానికి మమ్మలనందరినీ పిలిచినపుడు చేసిన ఆడంబరం, తనకీ వరసలంటే నచ్చదనీ, కావాలంటే శివ అని పిలవమని చెప్పడం పెద్దగా నచ్చలేదు సరే ఆయనిష్టం అనుకున్నాను. ఆ మాట విన్న అమ్మ గొణిగింది కానీ నాన్న పట్టించుకోలేదు.

పొట్టచేత్తో పట్టుకుని చెట్టుకొకరు, పుట్టకొకరుగా విడిపోయాం, మళ్ళీ ఎప్పటికైనా కలుస్తామా అనేవారు.. ఒక్క సత్యం బాబాయ్ ఒక్కడే నాన్న ఆలోచనలకి దగ్గరగా ఉన్నట్టుగా కనిపించేవారు.

" శిశిర్" వేర్ ఆర్ యూ" క్రాంతి మాటలకి ఈ లోకంలోకి వచ్చాను లంచ్ బ్రేక్ లో.

" ఏమిటంత ఆలోచన?" ఆమోఘ్ అడిగాడు.

క్లుప్తంగా చెప్పి నిన్నటివరకూ అలా ఉంటే అలా ఉన్నారనుకున్నాం, ఈరోజు వాళ్ళు ఫోన్లు చేసి ఇంటికి రమ్మంటే ఇదేమిటా? అనుకుంటున్నాను. నా ఆలోచనలు చూస్తే నాకే ఆశ్చర్యంగా ఉంది" అన్నాను..

ఆ తర్వాత వారం శివ బాబాయ్ ఇంటికి భోజనానికి వాళ్ళు పిలిస్తే అమ్మ విసుక్కుంటున్నా సరే వెళ్ళాల్సి వచ్చింది.

ఇంటిముందు నాలుగు కార్లు ఆగి ఉన్నాయి. ఇల్లంతా నవ్వులతో, కబుర్లతో మారుమోగుతోంది.

" రా అన్నయ్యా, మీరే లేట్, మిగతా అందరూ వచ్చేశారు అన్నాడు బాబాయ్ ఎదురొచ్చి నాన్న చెయ్యి పట్టుకుని లోపలకి తీసుకెళ్తూ.

ఆయన భార్య విశాలి పిన్ని కూడా " రా అక్కయ్యా!" అంటూ అమ్మని కౌగలించుకున్నంత పని చేసింది. 'రామ్మా!' అంటూ కావేరి భుజాల చుట్టూ చేతులు వేసుకుని మరీ తీసుకెళ్ళింది లోపలకి.

అక్కడేం జరుగుతోందో నాకర్థం కాలేదు సరికదా, లోపల లివింగ్ రూములో కూర్చున్న మా అత్తయ్యలూ, ఊర్లో ఉండే నాన్న కజిన్స్ ని చూసేసరికి మతి పోయినట్టయింది.

ఫంక్షన్లకి తప్పదని వచ్చి అరగంట ఉండి వెళ్ళిపోయే నేటి సాంప్రదాయాల ప్రతినిధులు వీరంతా. పెళ్ళయితే వచ్చి ఓ గిఫ్ట్ చేతిలో పెట్టేసి, భోంచేసి వెళ్ళిపోతారు.. అలాంటిది ఇలా అందరూ ఒక్క చోట చేరడం, నవ్వుతూ, కబుర్లు చెప్పుకుంటూ కులాసాగా ఉండడం చూస్తే , అది విచిత్రం కాక మరేమిటి?

"విస్సిగాడికి తెల్లవారుతుంది.. ఫోన్ చెయ్యండ్రా!" అంటోంది పెద్ద అత్త.

విస్సుబాబయ్య తో ఫేస్ టైం మొదలయింది. న్యూయార్క్ వీధులు అవీ చూపించాడుట వాళ్ళ కిటికీలోంచి అప్పటికే.

'రాము కేలిఫోర్నియాలో ఉంది కదా, కాసేపు ఆగుదాం !"అంటున్నాడు శివ బాబాయ్.

నాన్న ముఖం లో ఇదీ అని చెప్పలేని వెలుగు. అందరిమధ్యలోకి వెళ్ళి కార్పెట్ మీద కిందే కూర్చున్నారు.

" అదేవిటన్నయ్యా! సోఫాలో కూర్చో!" అంటున్న శివ బాబాయ్ మాటలు విన్నారో లేదో మరి!.

" నువ్వు చిన్నప్పుడు బీస్ సాల్ బాద్ సినిమాలో ఎంత భయపడ్డావురా? ఇప్పటికైనా తగ్గిందా భయం.. శారదత్త ఏడిపిస్తోంది హరి బాబయ్యని..

పక పకా నవ్వాడు. "అక్కయ్యా! నువ్వింకా మర్చిపోలేదూ !"ఆ సంగతి అంటూ..

"నీ వెనక తిరిగే పురుషోత్తం ఎలా ఉన్నాడే?" శారదత్తని అడుగుతోంది మరో అత్త వరలక్ష్మి.

" ఉండే ఉంటాడు ఎక్కడో సుఖంగా.. దీని పాల పడలేదుగా" ఈ సారి శివ బాబాయ్ అన్నాడు. ఆవిడ ఉడుక్కుంటే అందరూ నవ్వారు

నాన్న మాత్రం మాటలు రానివారిలా, మర్చిపోయిన వారిలా కూర్చుని టెన్నిస్ ఆట చూసే ప్రేక్షకుడిలా ఎవరు మాట్లాడితే వారి వైపు సంబరంగా చూస్తున్నారు.

మెల్లగా ఆడపిల్లల భర్తలూ, తోడికోడళ్ళూ చేరారు. అందరి కబుర్లలో, నవ్వుల్లో కాలం ఎలా గడిచిపోయిందో తెలీకుండా గంట పది కొట్టింది..

"ఇంక బయలుదేరదామా !" అంటూ ఉంటే పిన్ని అందరికీ ఐస్ క్రీములు తెచ్చింది.

అప్పుడే శివ బాబాయ్ నన్ను సైగ చేసి పక్కకి పిలిచాడు. అతనితో తన బెడ్ రూముకు ఆనుకుని ఉన్న బాల్కనీలోకి నడిచాను..

"ఇదంతా ఏమిటి అంకుల్, అదే బాబాయ్?" అని నువ్వడకముందే నేనే చెప్తా..

ఇది ప్రివ్యూ రా, అసలు సినిమా ముందుంది." పిక్చర్ అభీ బాకీ హై మెరే దోస్త్ "అన్నాడు నవ్వుతూ, అక్కడున్న ఒక కుర్చీలో కూర్చుని రెండో దాంట్లో నన్ను కూర్చోమని సైగ చేస్తూ..

" అంటే?" అన్నాను.

"అంటే అసలు సినిమా మీ నాన్న రిటైర్మెంట్, అరవైయ్యవ పుట్టినరోజు'.. అన్నాడు సూటిగా..

" ఓ" అన్నాను, అంతకంటే ఏమనాలో తెలీలేదు..

"ఇప్పుడు అసలు విషయం చెప్తాను, కాదు చూపిస్తాను" అంటూ మూడు పేజీల ఉత్తరం లాంటిదాన్నొకటి నా చేతిలో పెట్టాడు. "చదువు" అంటూ..

అది నాన్న చేతి రాత..

నాన్న రాసిన ఉత్తరం..

ఇంకా చెప్పాలంటే థాంక్ యూ నోట్.

తన కజిన్స్ పదకొండుమదికీ కలిపి, అందరి పేర్లు చేర్చి రాసినది.

" ప్రతి మనిషికీ తన స్వంతం అంటూ ఉండే భార్య, పిల్లలు అనేవి తప్ప, తనకున్న మిగతా జ్ఞాపకాలన్నీ వారితో ముడిపడినవేననీ, అందుకే ఎక్కడ మొదలుపెట్టాలో తెలీటం లేదు అంటూ మొదలయిన ఆ ఉత్తరం లో ఎన్నో సంగతులు, సంఘటనలు, జ్ఞాపకాలు. అన్నీ ఏ ఒక్కటీ వదలకుండా రాశారు.

ప్రతీ ఒక్కరితోనూ తనకున్న అనుబంధాన్ని, వాళ్ళు తన జీవితంలో ఉన్నందువల్ల తన జీవితమెంత ప్రత్యేకత సంతరించుకుందో, చిన్న చిన్న మాటల్లో చెప్పారు. వారితో ఆడిన ఆటలు, పాడిన పాటలు అన్నీ పూస గుచ్చారు.

చివరిగా.

స్థాయి కానీ, స్థితి కానీ వేరు చెయ్యలేనిది ఏదైనా ఉందంటే అది తొలి స్నేహితులనే కజిన్స్ తో ఉండే బంధమే.

దూరంగా ఉన్న దూరం రాకూడని బంధమది..

ఎడబాటున్నా ఎదనిండా ఉండవలసినది..

ఎక్కడున్నా ఎదపక్కనే ఉండాల్సిన భావమది..

వరసే తప్ప వయసుతో పనిలేనిది..

నాకు వీలున్నంతవరకూ మీ అందరితోనూ కలవడానికే ప్రయత్నించాను. ఎవరి జీవితాలు వారివైన ఈ కాలంలో చిన్నప్పటిలా ఉండడం అంటే జరిగే పని కాదని నాకు తెలుసు. బాధ్యతలు తీరి, విశ్రాంతి చేతికందుతున్న వేళ ఈ పరుగుపందెంలో, ఈ జీవితపు రిలే రేస్ లో చిన్నప్పటి తోటి ఆటగాళ్ళందరినీ కలుసుకోవాలాని మీకనిపించడం లేదా!

ఇదేమీ పతకాలు గెల్చుకునే ఆట కాదు, పలకరింపుల ఆట..

కొంతకాలం వెనక్కి వెళ్ళి మళ్ళీ ఆ రోజులని గుర్తు తెచ్చుకునే ఆట..

" ఒరే నా నీలం గోలీ నువ్వే తీసావు కదూ!"

" నా పుస్తకం చింపిందెవర్రా?"

" తాడాట లో నన్నెవరూ నెగ్గలేరుగా"

" నా మందారాం మొగ్గేసిందేవ్"

" ఎంటీవోడి సినిమాకేనా, ఓ యెస్! మన్మెప్పుడూ రెడీ!'

" చద్దన్నం, ఆవకాయా. సై అంటే సై"

“ఇవన్నీ గుర్తు లేవూ?? మరిచిపోయే రోజులా అవి? జ్ఞాపకాలా అవి? కాలం కలిసి వస్తే అలాంటివన్నీ మళ్ళీచెయ్యాలని లేదూ మీ అందరికీ? నాకైతే మనసంతా ఉంది..

అందుకే మీ అందరికీ ఎప్పుడు వీలుంటుందో చెప్పండి. జన్మలో మర్చిపోలేని మధుర జ్ఞాపకంలా ఆ సమవేశం నేను ఏర్పాటు చేస్తాను. ఇప్పుడు అరవై అంటే పాతకాలపు నలభైట.. అయినా ఏదీ మనచేతిలో లేదు కదా, మనకున్న మిగతా టైమైనా చేతిలోంచి జారిపోకముందే చెప్తారు గా. “అంతే, సింపుల్ గా, సూటిగా, సుతిమెత్తగా చెప్పిన మాటలవి.

నేనుచదవడం పూర్తి చేసి తలెత్తేసరికి చిన్నకన్నీటి చుక్కలతో నిండి నన్నే చూస్తున్న శివ బాబాయ్ కళ్ళు.

“ ఇదేరా,  నేను నీకారోజు ఫోన్ లో చెప్పిన చిన్న సంఘటన. ఇంపాక్ట్ మాత్రం పెద్దది.. ఇలాంటివి పదకొండు ఉత్తరాలు అందరికీ తన చేతివ్రాతలో రాసి, ఇక్కడున్న మా అందరికీ స్వయంగా తెచ్చి ఇచ్చాడు, దూరంగా ఉన్నవాళ్ళకి పోస్ట్ చేశాడు.

చదువులనో, ఉద్యోగాలనో వెతుకుతూ వెళ్ళే దారిలో ఎక్కడో పారేసుకున్న మా బాల్యం కాదు హృదయం కూడానేమో!

అందుకే మా అందరికీ ఒకేలా తగిలిందీ మెత్తని బాణం.

పిల్లలూ, మనవలూ, పూజలు అంటూ తమ సంసారాల్లో మునిగిపోతూ, తనకంటే మరో చెల్లో, అక్కో ఎక్కువగా ఉందన్న చిన్న పాటి అసూయకి,  బిజీ అన్న ముసుగు కప్పేసిన ఆడపిల్లలకీ..

అలాంటివే పైకి చెప్పలేని కాంప్లెక్సుల్లో చిక్కి బయటకి రాలేకపోతున్న మా లాంటి మగపిల్లలకీ, అందరికీ ఒకేలా తగిలింది రా.

దానికి కారణం వాడి మనసే, ప్రవర్తనే. అది ఇన్నాళ్ళైనా మారకపోవడమేమిటా? అనుకునేవాడిని మొన్నటివరకూ. ఇప్పుడది అలా మారకపోవడం ఎంత మంచిదయిందో? అనుకుంటున్నాను.

యస్! మేమదరం ఆ డేట్ నిర్ణయించుకున్నాం, అదే మీ నాన్న పుట్టినరోజే. ఇది కొంచం డ్రమాటిక్ గా అనిపించవచ్చు నీకు కానీ ఇంత గొప్ప సమవేశానికి ఆ మాత్రం డ్రామా ఉండచ్చు కదా.. అందుకే అన్నాను పిక్చర్ అభీ బాకీ హై మెరే దోస్త్ అని.. కాదు మా కాలపు భాషలో చెప్తాను.. మిగతాది వెండితెరమీద చూడండి! “

అంటూ నా చేతిలోని నాన్న ఉత్తరాన్ని అపురూపంగా తన చేతిలోకి తీసుకున్నాడు శివ బాబాయ్!!

COMMENTS